సాక్షి
వికారాబాద్
బుధవారం । 1 । మార్చి । 2023



నేటి నుంచి బ్రహ్మోత్సవాలు
వెల్‌చాల్ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహా స్వామి జాతర బుధవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. 8లో▸



ఆధునిక సాగు.. బహు బాగు
పంటల సాగు విధానంలో వేగంగా మార్పులు చోటుచేసుకుంటున్నాయి. సస్యరక్షణ చర్యల కోసం డ్రోన్లను వినియోగిస్తున్నారు. 8లో▸



బీఆర్ఎస్ చెప్పేదొకటి, చేసేదొకటి
బీఆర్ఎస్ నాయకులు, పాలకులు చెప్పేది ఒకటి, చేసేది ఒకటని మాజీ మంత్రి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. 9లో▸

న్యూస్‌రీల్

తండాలకు నిధులివ్వండి



మంత్రి సత్యవతి రాథోడ్‌ను కలిసిన ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి: నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి మంగళవారం నగరంలో గిరిజన, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతిరాథోడ్‌ను కోరారు. నియోజకవర్గంలోని పలు పంచాయతీలు, తండాలకు బీటీ, లింక్ రోడ్లు వేయించాలని కోరారు. ప్రత్యేక పంచాయతీలుగా అవతరించిన తండాల్లో వసతుల కల్పనకు చేయూతనివ్వాలన్నారు.

సర్కారు విద్యార్థులకు సన్న బియ్యం



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న రవీందర్‌సింగ్

అనంతగిరి: ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులకు సన్న బియ్యం సరఫరా చేస్తున్నామని సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్ అన్నారు. శివారెడ్డి పేటలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ బాలిక పాఠశాల– 1ను మంగళవారం సందర్శించారు. వంటగది, పరిశుభ్రత, బియ్యం, ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. భోజనం రుచిగా ఉందన్నారు. ఇదే నాణ్యతను మెయింటెయిన్ చేయాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట మార్కెటింగ్ జీఎం భాస్కర్, డీజీఎం అలివేలు మంగమ్మ, డీఎం విమల, డీసీఎస్ఓ రాజేశ్వర్, డీఎండబ్ల్యూఓ సంధ్యారాణి, డీటీ కార్తీక్, డీఎంఓ వైద్యనాథ్, అసిస్టెంట్ డీఎం సయ్యద్ అసరుద్దీన్, ప్రిన్సిపాల్ అనూష తదితరులు ఉన్నారు.

జొన్న, కుసుమ పంటల పరిశీలన



అవుసుపల్లిలో జొన్న పంటను పరిశీలిస్తున్న డీఏఓ గోపాల్ తదితరులు

ధారూరు: అవుసుపల్లి గ్రామంలో రైతులు సాగు చేసిన జొన్న, కుసుమ పంటలను జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్ మంగళవారం పరిశీలించారు. ఎకరాకు ఎంత పెట్టుబడి పెట్టారు.. ఏయే మందులు వాడారు..? సాగు విధానం తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. సేంద్రియ వ్యవసాయం ద్వారా నాణ్యమైన, ఆరోగ్యకరమైన దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. అధిక మొత్తంలో రసాయన ఎరువులను వాడటం వలన భూమి నిస్సారమవుతుందని వివరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో చిరుధాన్యాలను పండిస్తే మంచి లాభాలు ఆర్జించే అవకాశం ఉందని స్పష్టంచేశారు. సాగుచేసిన పంటల వివరాలను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని సూచించారు. అనంతరం రైతు వేదిక వద్దకు వచ్చి రికార్డులను పరిశీలించారు. డీఏఓ వెంట మండల వ్యవసాయ అధికారి జ్యోతి, మండల వ్యవసాయ విస్తరణ అధికారి సంజూరాథోడ్ ఉన్నారు.

ఆర్‌జీకే పాఠశాలకు ప్రత్యేక గుర్తింపు హర్షణీయం



మాట్లాడుతున్న ఉపాధ్యాయుడు

యాలాల: బషీర్‌మియాతండా స్కూల్‌లో విలీన పాఠశాలగా కొనసాగుతున్న ఆర్‌జీకే (రాజీవ్ గృహకల్ప) ప్రాథమిక పాఠశాలకు ప్రత్యేక గుర్తింపునిస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారు. ఈ మేరకు మంగళవారం బషీర్ మియాతండాలో ఏర్పాటు చేసిన సమా వేశంలో పాఠశాల సిబ్బంది, ఎస్ఎంసీ చైర్మన్, విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ.. రాజీవ్ గృహకల్ప, ఇందిరమ్మ కాలనీల పాఠశాలను వేరు చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయమన్నారు. పాఠశాలలకు వేర్వేరు డైస్ నంబర్లు కేటాయించినట్లు అధికారులు తెలిపారు. స్కూల్ పునర్విభజనకు కృషి చేసిన పీఆర్‌టీయూ నేతలు శ్రీధర్‌రెడ్డి, యాదయ్యగౌడ్, కల్లూరి వెంకట్‌రెడ్డికి తల్లిదండ్రులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఫలితాలు ప్రశ్నార్థకం!

ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల్లో ఈఏడాది ఫలితాలపై సర్వత్రా ఆందోళన నెలకొంది. టీచర్ల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారమే ఇందుకు కారణమని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

ముంచుకొస్తున్న వార్షిక పరీక్షల గడువు

- ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ఉపాధ్యాయులు
- ప్రమోషన్లు, ప్లేస్‌మెంట్లపైనే దృష్టి
- గాడి తప్పిన సర్కారు పాఠశాలల నిర్వహణ
- ఆందోళనలో విద్యార్థులు, తల్లిదండ్రులు



వికారాబాద్: నెల రోజుల్లో వార్షిక పరీక్షలు ప్రారంభం కానుండగా ప్రభుత్వ పాఠశాలల్లో అయోమయ పరిస్థితి నెలకొంది. మార్చిలో ఇంటర్, ఏప్రిల్ మొదటి వారంలో టెన్త్ ఎగ్జామ్స్ నిర్వహిస్తామని విద్యాశాఖ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సమయంలో టీచర్ల పదోన్నతులు, బదిలీల షెడ్యూల్‌ను విడుదల చేయడం విద్యార్థులు, తల్లిదండ్రులకు ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికే వెబ్ ఆప్షన్లు ఎంచుకున్న టీచర్లు ప్రక్రియ ఎప్పుడు ప్రారంభమవుతుందా అని ఎదురుచూస్తున్నారు. ఈ విషయంలో కొందరు కోర్టును ఆశ్రయించటంతో ట్రాన్స్‌ఫర్లకు తాత్కాలిక బ్రేక్ పడినా.. ఉపాధ్యాయుల దృష్టిమొత్తం బదిలీల్లో.. ఏ ప్లేస్ దొరుకుతుందా..? పదోన్నతి లభిస్తుందా.. లేదా..? అనే విషయాలపైనే ఉంది. ఇదే సమయంలో ఉపాధ్యాయ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో పంతుళ్లందరూ తమతమ సంఘాల అభ్యర్థులను గెలిపించుకునే ప్రచారంలో తలమునకలయ్యారు.

ప్రైవేటు పాఠశాలల్లో రివిజన్ పూర్తి

జిల్లాలోని మెజార్టీ ప్రైవేటు పాఠశాలల్లో ఇప్పటికే సిలబస్, రివిజన్ పూర్తయింది. పలు చోట్ల 9వ తరగతి విద్యార్థులకు ముందస్తుగానే టెన్త్ పాఠాలు సైతం ప్రారంభించారు. పదో తరగతి విద్యార్థులను వార్షిక పరీక్షల కోసం సిద్ధం చేస్తున్నారు. మంచి ర్యాంకులు, మెరుగైన మార్కులే లక్ష్యంగా వారు పోటీ పడుతుండగా.. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు మాత్రం ఎన్నికల ప్రచారంలో బిజీగా కనిపిస్తున్నారు. ప్రధానంగా ఉన్నత పాఠశాలలు, కళాశాలల్లో విధులు నిర్వహించే స్కూల్ అసిస్టెంట్లు, అధ్యాపకులే ఎమ్మెల్సీ ఓటర్లు కావడంతో తమ అభ్యర్థులను గెలిపించుకునేందుకు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. స్పెషల్ క్లాసులు తీసుకునేందుకు నానా తంటాలు పడే కొంతమంది టీచర్లు ఉదయం, సాయంత్రం వేళల్లో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తుండం గమనార్హం.

పర్యవేక్షణ గాలికి...

ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల పర్యవేక్షణ గాడితప్పిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాలో 185 ఉన్నత, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో సుమారు 62 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో 10వేల మంది టెన్త్ చదువుతున్నారు. ఇదిలా ఉండగా 92 హైస్కూళ్లు ఇన్‌చార్జ్ హెచ్‌ఎంలతో కొనసాగుతున్నాయి. దీంతో ఉపాధ్యాయుల పనితీరుపై గట్టిగా అడిగేవారే లేకుండా పోయారు. పరీక్షల సమయంలో పదోన్నతులు, బదిలీల ప్రక్రియ ప్రారంభించటంతో డీఈఓ ఇతర పర్యవేక్షణ అధికారులు సైతం ఆ పనుల్లో బిజీగా మారారు. దీంతో సర్కారు బడులను పట్టించుకునే వారే లేకుండాపోయారు.

రమణీయం.. శివపార్వతుల కల్యాణం

నవాబుపేట: ఎల్లకొండలోని పార్వతీపరమేశ్వరుల గుట్టపై మంగళవారం జరిగిన స్వామివారి కల్యాణ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. మహిళలు, భక్తులు వందలాదిగా తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఉదయం నుంచే ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు, పూజలు చేయించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కాలె యాదయ్య, ఆలయ చైర్మన్ భరత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రశాంత్‌గౌడ్, సర్పంచుల సంఘం నేత వెంకట్‌రెడ్డి, నాయకులు మల్లారెడ్డి, ప్రభాకర్ పాల్గొన్నారు.



శివపార్వతుల కల్యాణ వేడుకలకు హాజరైన మహిళలు



కొడంగల్‌లో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

మళ్లీ వస్తా.. పనితీరు చూస్తా

- కలెక్టర్ నారాయణరెడ్డి
- కొడంగల్‌లో పర్యటన
- అభివృద్ధి పనుల పరిశీలన
- అధికారులతో సమీక్ష సమావేశం

కొడంగల్: జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను మే నెలలోపు పూర్తి చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. కొడంగల్ మున్సిపల్ పరిధిలో మంగళవారం ఆయన ఆకస్మికంగా పర్యటించారు. పలు అభివృద్ధి పనులను పరిశీలించి సలహాలు, సూచనలు అందజేశారు. ఇసుకకు ఇబ్బంది లేకుండా అనుమతులు ఇస్తామని స్పష్టంచేశారు. నూతనంగా నిర్మిస్తున్న మున్సిపల్ కార్యాలయ భవనం, పట్టణ ప్రకృతి వనం, నర్సరీలను సందర్శించారు. ప్రతి నర్సరీలో 41వేల మొక్కలు పెంచాలన్నారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. డయాలసిస్ సెంటర్ ద్వారా మెరుగైన సేవలు అందించాలన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, వైస్ చైర్‌పర్సన్ ఉషారాణి, మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం తగదు..

అనంతగిరి: పల్లె ప్రగతి పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ నారాయణరెడ్డి హెచ్చరించారు. పల్లెప్రగతి, ఉపాధి హామీ, సీసీ రోడ్లు, మన ఊరు మన బడి పనుల పురోగతిపై ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఏపీఎంలు, ఇంజినీరింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉపాధి పనుల్లో భాగంగా పొలాలకు వెళ్లే బాటలను బాగు చేయాలన్నారు. గ్రామాల్లో చేపట్టిన మన ఊరు- మన బడి పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలోఅడిషనల్ కలెక్టర్ రాహుల్ శర్మ, డీఆర్‌ఓ అశోక్‌కుమార్, జెడ్పీ సీఈఓ జానకిరెడ్డి, డీఆర్‌డీఓ కృష్ణన్, డీఈఓ రేణుకాదేవి తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం

జిల్లాలో పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం ఇస్తున్నామని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రోడ్లను శుభ్రంగా ఉంచాలన్నారు. రోడ్లకు ఇరువైపులా పెరిగే పిచ్చి మొక్కలను తొలగించాలని ఆదేశించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా మిషన్ భగీరథ ద్వారా మంచినీటిని సరఫరా చేయాలన్నారు. హరితహారంలో నాటిన మొక్కలు ఎండిపోకుండా ట్యాంకర్ల ద్వారా నీళ్లు పోయాలని సూచించారు. అన్ని గ్రామాల్లో వైకుంఠధామాలను వినియోగంలోకి తేవాలని, ఇక్కడ మరుగుదొడ్లు, నీటి సౌకర్యం కల్పించాలని తెలిపారు. క్రీడా ప్రాంగణాలు, పల్లె ప్రకృతి వనాలను సుందరంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. రేషన్ షాపుల ద్వారా ప్రజలకు నిర్ణీత సమయంలో సరుకులు ఇవ్వాలని, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలని తెలిపారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు. కొడంగల్‌కు తాను మళ్లీ వస్తానని ఆలోపు పనులన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఎంపీడీఓ పాండు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

భర్త కోసం పోరాటం

- మరో పెళ్లికి సిద్ధమవుతున్నాడని ఆవేదన
- చౌడాపూర్‌లో బాధితురాలి నిరసన
- మద్దతు తెలిపిన స్థానిక నేతలు

కుల్కచర్ల: తన భర్త మరో అమ్మాయితో పెళ్లికి సిద్ధమయ్యాడని.. తనకు న్యాయం జరిగేలా చూడాలని కోరుతూ ఓ వివాహిత ఆందోళనకు దిగిన ఘటన మంగళవారం చౌడాపూర్ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన అనూశ్రీకి వికారాబాద్ జిల్లా చౌడాపూర్ గ్రామానికి చెందిన మొద్గుపల్లి సంపత్‌కుమార్‌రెడ్డి నగరంలోని ఓ మ్యాట్రిమోనీ ద్వారా పరిచయమయ్యారు. అనంతరం 2018 నవంబర్ 2న వివాహం చేసుకుని నగరంలోనే ఉంటున్నారు. ఇదిలా ఉండగా తన భర్త మరో మహిళను పెళ్లి చేసుకునేందుకు రెడీ అవుతున్నాడంటూ సదరు మహిళ అతడి స్వగ్రామంలో నిరసన చేపట్టింది. చౌడాపూర్ ప్రధాన చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట బైఠాయించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తన భర్త, కుటుంబీకులు తనను మానసికంగా, శారీరకంగా ఇబ్బంది పెడుతున్నారని, అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించింది. దళిత మహిళ వంటూ హేళన చేస్తున్నారని తెలిపింది. తన భర్తను గ్రామానికి పిలిపించి, న్యాయం చేయాలని నినాదాలు చేసింది. స్థానిక ప్రజాప్రతినిధులు, దళిత సంఘాల నేతలు ఆమెకు మద్దతుగా ప్రధాన చౌరస్తాలో బైఠాయించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ గిరి బాధితురాలికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. సంపత్‌కుమార్‌రెడ్డి, అతని కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అయితే ఈ అంశం కోర్టు పరిధిలో ఉందని వారు ఎస్ఐకి తెలిపారు. ఈక్రమంలో అనూశ్రీ తన వెంట తెచ్చుకున్న నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. పోలీసులు వెంటనే ఆమెను 108 వాహనంలో పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



చౌడాపూర్ గ్రామ ప్రధాన చౌరస్తాలో అందోళన చేస్తున్న బాధితురాలు



అనూశ్రీకి మద్దతుగా బైఠాయించిన స్థానిక నాయకులు

మురిసిన ‘మధ్యాహ్నం’

మధ్యాహ్న భోజనం విషయంలో ప్రభుత్వం సానుకూల నిర్ణయాలు తీసుకుంది. భోజనం కోసం విద్యార్థులకు అందిస్తున్న డబ్బులను పెంచుతున్నట్లు జనవరి చివర్లో ప్రకటించింది. ఆ వెంటనే కార్మికుల గౌరవ వేతనాలను సైతం పెంచుతూ ఇటీవలే ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో అటు విద్యార్థులు, ఇటు ఏజెన్సీల మహిళలు సంతోషం వ్యక్తంచేస్తున్నారు.

- భోజనం డబ్బులు, గౌరవ వేతనాలు పెంచుతూ ప్రభుత్వ ఉత్తర్వులు
- కార్మికుల ఏడేళ్ల కల సాకారం
- ప్రతినెలా చేతికందనున్న రూ.3 వేలు
- విద్యార్థులకు అందించే భోజనంలోనూ నాణ్యత పెరిగే అవకాశం



మధ్యాహ్న భోజనం వండుతున్న కార్మికులు

వికారాబాద్ అర్బన్: సర్కారు బడుల్లో వండివారుస్తున్న సిబ్బంది కష్టానికి ఎట్టకేలకు ఫలితం దక్కింది. సుమారు ఏడేళ్ల తర్వాత వీరి జీతాలను పెంచుతూ జీవో జారీచేసింది. ఈ డబ్బులను పబ్లిక్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా నేరుగా నిర్వాహకుల ఖాతాల్లో జమచేయనున్నారు. పెంచిన డబ్బులను ప్రస్తుత విద్యాసంవత్సరం ప్రారంభం నుంచే ఇచ్చేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. దీంతో కార్మికులకు కొంత ఆర్థిక వెసులుబాటు దక్కనుంది.

పెరిగిన ధరలు ఇలా..

గతంలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ఒక్కో విద్యార్థికి రోజుకు రూ.4.97 చెల్లించేవారు. ఈ మొత్తాన్ని రూ.5.46కి పెంచారు. ఆరు నుంచి ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.7.45 చెల్లిస్తుండగా.. రూ.8.17కి పెంచారు. 9,10వ తరగతుల వారికి రూ.9.95 నుంచి రూ.10.67కు పెంచారు.

861 పాఠశాలల్లో ఏజెన్సీలు

జిల్లా వ్యాప్తంగా 1,030 పాఠశాలలు ఉండగా 861 స్కూళ్లలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్నారు. మరో 169 పాఠశాలల్లో అక్షయ పాత్ర ద్వారా వడ్డిస్తున్నారు. దాదాపు 62వేల మంది విద్యార్థులకు నిత్యం మిడ్ డే మీల్ తింటున్నారు.

పెరిగిన వేతనం

పెరిగిన నిత్యావసరాల ధరలకు అనుగుణంగా కార్మికుల గౌరవ వేతనం పెంచాలని మధ్యాహ్న భోజన కార్మికులు అనేకసార్లు ఆందోళనకు దిగారు. గత అసెంబ్లీ సమావేశాల సమయంలో వీరి వేతనాన్ని రూ.వెయ్యి నుంచి రూ.3 వేలకు పెంచుతున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. కానీ అమలుకు మాత్రం నోచుకోలేదు. ప్రస్తుతం గతంలో ఇచ్చిన హామీ మేరకు వేతనాలు పెంచింది. నెలకు రూ.3 వేల చొప్పున చెల్లించాలని నిర్ణయించింది. దీనిద్వారా జిల్లాలోని 1,646 మంది మహిళలకు ఆర్థిక భరోసా దక్కనుంది. విద్యాశాఖ అధికారులకు ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు అందాయి. పూర్తిస్థాయి మార్గదర్శకాలు వెలువడగానే పెరిగిన వేతనాలు అమలవుతాయని తెలుస్తోంది.

జిల్లాలో మొత్తం పాఠశాలలు	-	1,030
ఎండీఎం ఏజెన్సీలు	-	861
అక్షయ పాత్ర స్కూల్స్	-	169
మధ్యాహ్న భోజన కార్మికులు	-	1,646
మొత్తం విద్యార్థులు	-	62 వేల మంది

17నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు

కొడంగల్: వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నా మని ఆలయ ధర్మకర్త నందారం శ్రీనివాస్ తెలిపారు. ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను మంగళవారం శ్రీవారి ఆలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వైస్ చైర్‌పర్సన్ ఉషారాణి, డీడీఎస్ జిల్లా అధ్యక్షుడు జయతీర్థాచారి, పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్ గుప్త, ఆలయ ధర్మకర్తలు నందారం శ్రీనివాస్, నందారం రత్నం తదితరులతో కలిసి బ్రోచర్, పోస్టర్‌ను విడుదల చేశారు. ఈనెల 17న ప్రారంభమయ్యే వేడుకలు 27న ముగుస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఎం.రాజు, బాలప్రకాశ్ పాల్గొన్నారు.



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నేతలు

క్లుప్తంగా

నేత్ర పర్వంగా నర్సింహస్వామి కల్యాణం

పాల్గొన్న ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి



ప్రత్యేక పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి, భక్తులు

దోమ: మండలంలోని మల్లేపల్లిలో వెలసిన లక్ష్మీనర్సింహస్వామి కల్యాణోత్సవం మంగళవారం నేత్ర పర్వంగా సాగింది. ఈ వేడుకకు ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి, జెడ్పీటీసీ నాగిరెడ్డి హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు దైవభక్తిని అలవర్చుకోవాలని సూచించారు. అంతకుముందు ఆలయ అర్చకుడు జ్యోషి సత్యనారాయణ వేద మంత్రోచ్చారణల మధ్య స్వామివారి కల్యాణాన్ని జరిపించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకను తిలకించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మల్లేశం, సర్పంచ్ దొడ్ల అంజిలయ్య తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల పరిశీలన



ఉత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న వేదపండితులు, నాయకులు

పరిగి: పట్టణంలో కొలువుదీరిన వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను మంగళవారం మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్, వేదపండితులు, రేపల్లే రాజీవ్‌శర్మతో కలపి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. మూడు రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు. భక్తులకు అన్ని సదుపాయాలు కల్పించినట్లు వివరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్, నాయకులు ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

- ముస్తాబైన లక్ష్మీనరసింహస్వామి ఆలయం
- మూడు రోజుల పాటు ఉత్సవాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీ

మోమిన్‌పేట: మండలంలోని వెల్‌చాల్ గ్రామం చుట్టూ ఎత్తైన గుట్టలు... దట్టమైన అటవీ ప్రాంతం .. ఆహ్లాదకరమైన ప్రదేశంలో వెలసిన లక్ష్మీ నరసింహస్వామి జాతర మార్చి ఒకటవ తేదీ నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. ఇందుకోసం ఆలయాన్ని ముస్తాబుచేశారు. ఒకటవ తేదీ ధ్వజారోహణం, పల్లకీసేవ, ఎల్లమ్మ తల్లికి బోనాలు, 2న స్వామి వారి రథోత్సవం, 3న స్వామి వారి కల్యాణోత్సవం, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని ఉత్సవ కమిటీ నిర్వాహకులు తెలిపారు. మూడు రోజుల పాటు భజన ఉంటుందన్నారు.

పులిలొంకే పుణ్యక్షేత్రమైంది

ఒకప్పుడు పులులు సంచరించే దట్టమైన అడవి.. ప్రస్తుతం లక్ష్మీ నరసింహస్వామి ఆలయంగా విరాజిల్లుతోంది. కృషి ఉంటే మనుషులు మహా రుషులు అవుతారు అన్న నానుడిని నిజం చేశాడు ఓ మేకల కాపరి. 58 సంవత్సరాల క్రితం ఈ అడవిలోకి వెళ్లాలంటేనే ఇక్కడి వారికి భయం వేసేది. మేకల కాపరి ఒంటరిగా అడవిలోకి వెళ్లేవాడు. ఈ క్రమంలో సుమారు 20 మీటర్ల పొడవు, నాలుగు మీటర్ల వెడల్పుతో పెద్ద గుహను తొలిచాడు. అందులో లక్ష్మీ నరసింహస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించాడు. అప్పటి నుంచి పులిలొంక.. పుణ్యక్షేత్రమైంది. ఆ మేకల కాపరి పర్మయ్య పరమదాసుగా అవతరించారు.

దినదినాభివృద్ధి

లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకోవడానికి దూర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. భక్తులు ఇచ్చే విరాళాలతో ఆలయాన్ని పరమదాసు అభివృద్ధి చేశారు. మంచి నీటి సౌకర్యం కోసం కొలను నిర్మించారు. ప్రతి సంవత్సరం ఫల్గున శుద్ధ దశమి నుంచి మూడు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు కన్నుల పండువగా నిర్వహిస్తారు.




గుట్టపై వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయం

ఆలయాలు, విగ్రహాల ప్రతిష్ఠాపన

దేవాలయ ప్రాంగణంలో ఆంజనేయస్వామి ఆలయం, గుహలో వేంకటేశ్వరస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. సంతానం లేని జంటలు ఇక్కడి మేడి చెట్టుకు కొబ్బరి కాయలను కడితే ఏడాది లోపు సంతానం కలుగుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

గుహ ప్రత్యేక ఆకర్షణ

దైవ సంకల్పంతోనే గుహ తొలచి విగ్రహ ఏర్పాటుకు పూనుకున్నట్లు పరమదాసు పేర్కొంటారు. ఒక మనిషి ఒంటరిగా 20 మీటర్ల పొడవు, నాలుగు మీటర్ల వెడల్పుతో గుట్టను గుహగా.. గుడిగా మలిచి అందులో వేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించడం గొప్ప విషయం. ప్రస్తుతం ఆలయం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.



పరమదాసు చెక్కిన గుహ

ఆలయానికి ఇలా చేరుకోవచ్చు

మోమిన్‌పేటకు 9కిలో మీటర్ల దూరంలో లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఉంది. వికారాబాద్ నుంచి సదాశివపేటకు వెళ్లే మార్గంలో వెల్‌చాల్ బస్టాండ్ ఉంది. అక్కడ దిగి 2కిలో మీటర్లు ఆటోలో వెళితే ఆలయం చేరుకోవచ్చు. ప్రతి 20 నిమిషాలకు ఓ బస్సు ఉంది. వికారాబాద్, జహీరాబాద్ నుంచి రైలు సౌకర్యం కూడా ఉంది. వెల్‌చాల్ సమీపంలో సదాశివపేట రోడ్డు, స్టేషన్‌లో దిగి ఆటోలో వెళ్లవచ్చు.

సమయపాలన పాటించాలి

- మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి లలితకుమారి

పరిగి: అంగన్‌వాడీ టీచర్లు సమయపాలన పాటించాలని, లేకుంటే శాఖాపరమైన చర్యలు తప్పవని మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి లలితకుమారి హెచ్చరించారు. మంగళవారం పరిగి పట్టణంలోని అంగన్‌వాడీ టీచర్లతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. గర్భిణులు, చిన్నారులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఆదేశించారు. ప్రతి నెలా చిన్నారుల బరువు, ఎత్తును కొలతలు తీయాలని సూచించారు. పౌష్టికాహార లోపం ఉంటే వారికి అదనంగా ఆహారం ఇవ్వాలన్నారు. గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి గర్భిణులకు పౌష్టికాహార ఆవశ్యకతపై అవగాహన కల్పించాలన్నారు. పిల్లలకు తల్లి పాల వల్ల కలిగే ప్రయోజనాన్ని వివరించాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఐసీడీఎఫ్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ వెంటేశ్వరమ్మ, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న లలితకుమారి

శ్మశానవాటిక కబ్జాపై కలెక్టర్‌కు ఫిర్యాదు



శ్మశానవాటిక కబ్జాపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న సంఘం నేతలు

దోమ: మండలంలోని దాదాపూర్‌లో ముదిరాజ్‌ల శ్మశానవాటిక భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామ సర్పంచ్ సర్పంచ్ కృష్ణ ముదిరాజ్ కోరారు. మంగళవారం ఈ మేరకు వికారాబాద్‌లో కలెక్టర్ నారాయణ రెడ్డిని కలసి ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కొన్నేళ్ల క్రితం గ్రామానికి చెందిన భూస్వాములు సర్వే నంబర్ 3, 4లో మూడెకరాల భూమిని ముదిరాజ్‌ల శ్మశానవాటిక కోసం ఇచ్చారన్నారు. ఆ భూమిలో ముదిరాజ్‌లు దహన సంస్కారాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల ఆ భూమి తమదే అంటే చుట్టు పక్కల రైతులు గొడవకు దిగుతూ కబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని పలు మార్లు రెవెన్యూ అధికారులకు విన్నవించినా వారు పట్టించుకోవడం లేదని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కబ్జాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని సర్పంచ్ కోరారు. ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు రమేశ్, మత్స్యసహకార సంఘం గ్రామ అధ్యక్షుడు రాములు, సంఘం సభ్యులు చందర్, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

యాలాల: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ మహిళ ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన మండలంలోని బండమీదిపల్లిలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ అరవింద్‌కుమార్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన పద్మమ్మ(35) కూలీ పనిచేస్తుండేది. మూడేళ్ల క్రితం భర్త చనిపోవడంతో అత్తతో కలిసి ఉంటోంది. కొన్ని రోజులుగా కుటుంబ కలహాలతో సతమతమవుతోంది. ఈ విషయమై మనస్థాపం చెంది మంగళవారం ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారమిచ్చారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మతిస్థిమితం లేని వ్యక్తి అప్పగింత

నవాబుపేట: మండలంలోని అక్నాపూర్ గ్రామ పరిసరాల్లో తిరుగుతున్న మతిస్థిమితం లేని వ్యక్తిని మంగళవారం పోలీసులు పీఎస్‌కు తీసుకొచ్చారు. అనంతరం ఎస్‌ఐ భరత్‌భూషన్ వివరాలకు సేకరించారు. నారాయణపేట జిల్లా వోట్లూర్ మండలం వల్లంపల్లికి చెందిన పేట రాజుగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి అతన్ని తీసుకెళ్లినట్లు ఎస్‌ఐ తెలిపారు.



మతిస్థిమితం లేని వ్యక్తిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసు

ఫోన్ చేసి.. ఇంటికి కన్నం వేసి..

- నగలు, నగదు అపహరణ
- 6 గంటల్లో నిందితుడి అరెస్ట్

ధారూరు: పరిచయం ఉన్న వ్యక్తి కుటుంబంతో తిరుపతికి వెళ్లారన్న సమాచారం అందుకున్న ఓ దొంగ చేతివాటం ప్రదర్శించాడు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో దర్జాగా చొరబడి అందినకాడికి దోచుకెళ్లాడు. పోలీసుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన దుబ్బ మల్లేశం గత నెల 22న కుటుంబ సభ్యులతో కలసి తిరుపతికి వెళ్లాడు. ఈ విషయం మండలంలోని హరిదాస్‌పల్లికి చెందిన రాములుకు తెలిసింది. రాములుకు.. దుబ్బ మల్లేశంతో పరిచయం ఉండడంతో 26న సాయంత్రం నేరుగా అతనికే ఫోన్ చేసి తిరుపతికి వెళ్లిన విషయాన్ని నిర్ధరించుకున్నాడు. అదే రోజు రాత్రి మల్లేశం ఇంట్లోకి చొరబడి రూ. 1.53 లక్షల నగదు, బంగారు గుండ్లు, నెక్లెస్, కమ్మల ఎత్తుకెళ్లాడు. సోమవారం తిరుపతి నుంచి వచ్చిన మల్లేశం ఇంట్లో దొంగలు పడిన విషయాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ధారూరు సీఐ అప్పయ్య ప్రత్యేక చొరవ తీసుకుని దొంగ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. పాత నేరస్తుల జాబితాపై దృష్టి సారించారు. దొంగను గుర్తించే క్రమంలో దుబ్బ మల్లేశం ఫోన్ కాల్ డేటాను పరిశీలించారు. దీంతో రాములు.. మల్లేశంకు ఫోన్ చేసిన విషయం బయటపడింది. ఆ కోణంలో విచారణ జరిపి నిందితున్ని అదుపులోకి తీసుకున్నారు. దొంగతనం జరిగిన 6గంటల్లోనే రాములును అదుపులోకి తీసుకొని, నగదు, నగలు స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన ఎస్‌ఐ సంతోష్‌కుమార్, సిబ్బందిని సీఐ అభినందించారు.



రాములును అరెస్టు చూపుతున్న సీఐ అప్పయ్య

రాష్ట్రంలో అధికారం మాదే

మాజీ మంత్రి చంద్రశేఖర్



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

అనంతగిరి: తెలంగాణలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని మాజీ మంత్రి డాక్టర్ ఏ చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం వికారాబాద్‌లోని పాతగంజ్‌లో ప్రజా గోస – బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎనిమిదేళ్ల పాలనలో సీఎం కేసీఆర్ ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. రాష్ట్రంలో కుటుంబ పాలన కొనసాగుతోందని ఆరోపించారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరిస్తున్నారని పేర్కొన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక దేశంలో అనేక మార్పులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ యాస్కి శిరీష, రాష్ట్ర నాయకులు శివరాజు, మాధవరెడ్డి, పట్టణ అధ్యక్షుడు రాజేందర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ సుచరితారెడ్డి, జిల్లా నాయకులు అమరేందర్‌రెడ్డి, పోకల సతీష్, రాచ శ్రీనివాస్‌రెడ్డి, నందు, శ్రీకాంత్, చరణ్, యాస్కి మల్లికార్జున్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక సాగు.. బహు బాగు

డ్రోన్ ద్వారా చీడపీడల నివారణ

- తాండూరు వ్యవసాయ పరిశోధన స్థానంలో రెండేళ్లుగా పైలెట్ ప్రాజెక్ట్
- నేడు రైతులకు క్షేత్రస్థాయి ప్రదర్శన, అవగాహన



డ్రోన్ ద్వారా కంది పంటపై మందు పిచికారీ

తాండూరు: పంటల సాగు విధానంలో వేగంగా మార్పులు చోటుచేసుకుంటున్నాయి. గతంలో పంటల్లో చీడపీడల నివారణకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టేవారు. ఈ విధానం కొంత ఇబ్బందిగా ఉండేది. ఈ సమస్యలకు చెక్ పెట్టేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చారు. పంటలకు ఆశించే చీడపీడల నివారణకు మందు పిచికారీ చేసేందుకు డ్రోన్ విధానం అందుబాటులోకి వచ్చింది. తాండూరు వ్యవసాయ పరిశోధన స్థానంలో పైలెట్ ప్రాజెక్ట్ సక్సెస్ కావడంతో రైతులకు అవగహన కల్పించేందుకు శాస్త్రవేత్తలు సిద్ధమయ్యారు. జిల్లాలోని రైతులకు పంటల సాగుపై ఎప్పటికప్పుడు నూతన విధానాలను అందుబాటులోకి తెచ్చేందుకు తాండూరు వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు ముందువరుసలో నిలుస్తున్నారు. ఇక్కడ కంది, కుసుమ, పొద్దుతిరుగుడు, పెసర, మినుము వంటి కొత్త రకం వంగడాలను సృష్టించారు. కొత్త రకం వంగడాలతో దిగుబడితో పాటు పోషక విలువలు అధికంగా ఉండేలా తయారు చేస్తున్నారు. మరోవైపు పశువులు, అడవి పందుల వల్ల పంటలకు నష్టం కలగకుండా ధ్వని పరికరాన్ని తయారు చేసి రైతులకు పరిచయం చేశారు. రసాయనాల మిశ్రమం వాడకుండా సేంద్రియ కందిపప్పు, కుసుమ నూనెలను సహజ సిద్ధంగా తీసే విధానాన్ని అందుబాటులోకి తేవడంతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రశంసలు అందుకున్నారు. కందికి భౌగోళిక గుర్తింపు తీసుకురావడంలో ఇక్కడి శాస్త్రవేత్తలు ఆదర్శంగా నిలిచారు. రెండేళ్లుగా శాస్త్రవేత్తలు డ్రోన్ ద్వారా పురుగు మందు పిచికారీని విజయవంతంగా నిర్వహిస్తున్నారు. ఈ విధానం ద్వారా సస్యరక్షణ చర్యలు చేపట్టడం వల్ల పంటలకు మేలు చేకూరుతుంది. అలాగే రైతుకు కూలీలతో పని ఉండదు. అయితే వ్యవసాయ యూనివర్సిటీకి మాత్రమే డ్రోన్ వినియోగానికి ప్రభుత్వం నుంచి అనుమతులు ఉన్నాయి. రైతులు సొంతంగా డ్రోన్లు ఉపయోగించేందుకు అవకాశం లేదు. రానున్న రోజుల్లో ప్రభుత్వం రైతులకు ఈ సదుపాయం కల్పించే అవకాశం లేకపోతేదు.

నేడు రైతులకు అవగహన

తాండూరు వ్యవసాయ పరిశోధన స్థానం ఆధ్వర్యంలో డ్రోన్ ద్వారా పంటల్లో చీడపీడల నివారణపై బుధవారం రైతులకు క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించనున్నారు. ఈ సదస్సులో డ్రోన్‌తో పిచికారీ చేసే విధానంపై రైతులకు అవగహన కల్పిస్తామని శాస్త్రవేత్తలు డాక్టర్ సీ సుధారాణి, డాక్టర్ సుధాకర్ చౌరట్ తెలిపారు.

దావత్‌కు వెళ్లి వస్తుండగా..

- వాహనం ఢీకొనడంతో ఇద్దరు స్నేహితుల మృతి



గణేశ్, శివశంకర్ (ఫైల్)

చేవెళ్ల/ ధారూర: దావత్‌కు వెళ్లి తిరిగి వస్తున్న ఇద్దరు స్నేహితులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. వీరి బైక్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆలూరు సమీపంలో సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. వికారాబాద్ జిల్లా ధారూరు మండలం గురుదుట్ల గ్రామం ఉరేంటి తండాకు చెందిన నేనావాత్ గణేశ్ (24), అదే గ్రామానికి చెందిన శివశంకర్ నాయక్(20) స్నేహితులు. డిగ్రీ వరకు చదువుకున్న వీరు.. క్యాటరింగ్ పనులు చేసుకుంటూ తల్లిదండ్రులకు చేదోడుగా ఉంటున్నారు. సోమవారం పూడూరు మండల పరిధిలోని తిర్మాలాపూర్ తండాలో స్నేహితుడి ఇంట్లో దావత్ ఉందని వీరిద్దరు బైక్‌పై వచ్చారు. అనంతరం అర్ధరాత్రి తిరుగు ప్రయాణం అయ్యారు. వారితో పాటు ఉన్న మరో స్నేహితుడు ప్రదీప్ మన్నెగూడలో దిగాడు. అయితే గణేశ్, శివశంకర్ బైక్‌పై మళ్లీ చేవెళ్ల వైపునకు వెళ్లారు. మార్గమధ్యలో ఆలూరు బస్సు స్టేజీకి సమీపంలోకి రాగానే గుర్తు తెలియని వాహనం వీరి బైక్‌ను ఢీకొట్టడంతో ఇద్దరూ కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాలను చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందటంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

చేవెళ్ల వైపు ఎందుకు వచ్చారు..?

మిత్రులిద్దరు దావత్ పూర్తయిన తర్వాత ధారూరు వెళ్లాల్సింది పోయి చేవెళ్ల వైపు ఎందుకొచ్చారని కుటుంబసభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వీరి వెంట మరో స్నేహితుడు ప్రదీప్‌ను మన్నెగూడలో దింపి .. మళ్లీ వెనక్కి ఎందుకు వెళ్లాల్సి వచ్చిందో అర్థం కావడం లేదన్నారు. ప్రదీప్ మాత్రం తనకేమి తెలియదని చెబుతున్నాడు. ఈ ప్రమాదంపై తమకు అనుమానాలు ఉన్నాయని, పోలీసులు ఈ దిశగా దర్యాప్తు చేపట్టాలని వారు కోరుతున్నారు.

ఎమ్మెల్యే యాదయ్య పరామర్శ

చేవెళ్ల ఆస్పత్రిలో ఇద్దరి మృతదేహాలను ఎమ్మె ల్యే కాలె యాదయ్య పరిశీలించారు. ప్రమాదం ఎలా జరిగిందని అడిగి తెలుసుకున్నారు. కు టుంబసభ్యులను ఓదార్చారు. ప్రభుత్వ పరం గా సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు.

ఊరెంట తండాలో పెను విషాదం



గణేశ్, శివశంకర్ నాయక్ మృతదేహాలు

ధారూరు: మండలంలోని ఊరెంట తండాలో మంగళవారం పెను విషాదం చోటుచేసుకుంది. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం ఆలూరు గేట్ సమీపంలో గుర్తు తెలియని వాహనం బైక్‌ను ఢీ కొట్టిన ప్రమాదంలో ఊరెంట తండాకు చెందిన ఇద్దరు యువకులు గణేశ్(22), శివశంకర్(24) దుర్మరణం చెందారు. దీంతో గ్రామం శోకసంద్రంలో మునిగింది. సాయంత్రం తండాలో అంత్యక్రియలు నిర్వహించారు.

రానున్నది బహుజనుల రాజ్యమే

- బీఎస్పీ రాజ్యసభ సభ్యుడు గౌతమ్



సమావేశంలో మాట్లాడుతున్న బీఎస్పీ నాయకులు

తాండూరు టౌన్: రానున్నది బహుజనుల రాజ్యమేనని బీఎస్పీ రాజ్యసభ సభ్యులు, జాతీయ కోఆర్డినేటర్ శ్రీరామ్ జీ గౌతమ్ అన్నారు. మంగళవారం బీఎస్పీ రాష్ట్ర కోఆర్డినేటర్ చంద్రశేఖర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో తాండూరులో జరిగిన నియోజకవర్గ బూత్ కమిటీల సమీక్ష సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అగ్రవర్ణాల పాలనలో అణగారిన వారి అభ్యున్నతి అడుగంటి పోయిందన్నారు. జనాభాలో అత్యధిక సంఖ్యలో ఉన్న బహుజనులకు రాజ్యాధికారం దక్కకుండా అగ్రవర్ణాల వారు అడ్డు తగులుతున్నారని ఆరోపించారు. ఇందుకు బహుజనులంతా ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. తాండూరు నియోజకవర్గంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు అధికారం అందని ద్రాక్షలా మారిందన్నారు. దీన్ని మార్చడంలో బీఎస్పీ కార్యకర్తలందరూ సైనికుల్లా పనిచేయాలన్నారు. బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేసి రాబోయే ఎన్నికల్లో బహుజనుల సత్తా చూపాలన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర చీఫ్ కోఆర్డినేటర్ మంద ప్రభాకర్, రాష్ట్ర కోఆర్డినేటర్ పసుపుల బాలస్వామి, నేతలు వెంకటేష్, సతీష్, దయానందరావు, సత్యమూర్తి, అరుణ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిని సందర్శించిన రాష్ట్ర వైద్య బృందం



కుల్కచర్ల ఆస్పత్రి పరిసరాలను పరిశీలిస్తున్న రాష్ట్ర వైద్య బృందం

కుల్కచర్ల: గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఉస్మానియా మెడికల్ కాలేజ్ ప్రొఫెసర్ యాదయ్య సూచించారు. మంగళవారం నేషనల్ హెల్త్ సిస్టం రిసోర్స్ సెంటర్ రాష్ట్ర వైద్య బృందంతో కలిసి కుల్కచర్ల ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే వైద్య ఉద్యోగుల ప్రథమ కర్తవ్యమని, అందుకు అనుగుణంగా ఆసుపత్రులను మరింత ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటాయని పేర్కొన్నారు. కుల్కచర్ల ప్రభుత్వ ఆసుపత్రిని ఎన్‌క్వాస్ అవార్డును ఎంపిక చేసేందుకు కమిటీ ఆసుపత్రి పరిసరాలు, పరిస్థితులు తదితర అంశాలను పరిశీలించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ చంద్రప్రకాష్, వైద్య సిబ్బంది వెంకట్, విజయలక్ష్మి, ప్రశాంతి, సాజన్ బేగం, ఫార్మాసిస్టు మల్లేశం, జ్యోతి, జంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ అవినీతి పాలనను తరిమికొడదాం

- మోసపూరిత హామీలను నమ్మకండి
- బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు శ్రీలత



పెద్దేముల్ కార్యక్రమంలో మాట్లాడుతున్న సాహు శ్రీలత

పెద్దేముల్: కేసీఆర్ అవినీతి పాలనను తరిమికొట్టే రోజులు దగ్గర పడ్డాయని బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సాహు శ్రీలత పేర్కొన్నారు. మంగళవారం పెద్దేముల్‌లో ప్రజాగోస – బీజేపీ భరోసా కార్నర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. ఎనిమిదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రైతు రుణమాఫీ, రేషన్ కార్డులు, మూడు ఎకరాల భూమి, డబుల్ బెడ్‌రూం ఇళ్ల హామీలు అమలు కాలేదన్నారు. ఎన్నో ఆశయాలతో ఏర్పడిన తెలంగాణలో ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. హామీల అమల్లో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. కేంద్ర పథకాలను రాష్ట్ర ప్రభుత్వం నీరుగారుస్తోందని మండిపడ్డారు. పంచాయతీలకు కేంద్రం ఇచ్చే నిధులను కూడా రాష్ట్ర ప్రభుత్వం దోచుకుంటోందని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు తమ ఓటును వజ్రాయుధంగా వాడుకొని బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలను చిత్తుగా ఓడించి, బీజేపీకి పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సందీప్ కుమార్, మండల ఇన్‌చార్జ్ భద్రేశ్వర్, శక్తి కేంద్ర ఇన్‌చార్జ్ యాదయ్య గౌడ్, బుత్ కన్వీనర్ మహ్మద్, నాయకులు శ్రుతి, రేణుక, ఉమా, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

రానున్నది బీజేపీ ప్రభుత్వమే

కుల్కచర్ల: రాష్ట్రంలో బీఆర్ఎస్ అవినీతి ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాద్‌రావ్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఘణపురం వెంకటయ్య అన్నారు. మంగళవారం కుల్కచర్లలో స్ట్రీట్ కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జానకీరాం, పార్టీ మండల అధ్యక్షుడు మైపాల్, బీజేవైఎం మండల అధ్యక్షుడు గడుసు మైపాల్, నాయకులు కాటనిపల్లి ఆంజనేయులు, చంద్రలింగం, శివ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో బీజేపీదే అధికారం

తాండూరు రూరల్: రాష్ట్రంలో బీజేపీదే అధికారమని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు సంజీవ్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం మండలంలోని చంద్రవంచ గ్రామంలో ప్రజాగోస – బీజేపీ భరోస కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సంజీవ్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో రోజురోజుకూ బీఆర్ఎస్ ఆగడాలు పెరిగిపోతున్నాయని ఆరోపించారు. రాష్ట్రాన్ని కల్వకుంట్ల కుటుంబం మాత్రమే రాజ్యమేలుతోందన్నారు. బీఆర్ఎస్‌పై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని, బీజేపీ వైపు ప్రజలు ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శేఖాపురం ఆంజనేయులు, శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ జర్నప్ప తదితరులు పాల్గొన్నారు.